


6 గంటలకే పింఛన్ల పంపిణీ

అధికారులను ఆదేశించిన కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూల్(కలెక్టరేట్), జూలై 30: ఆగస్టు 1వ తేదీ ఉదయం 6 గంటలకే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ పింఛన్ల పంపిణీపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా జిల్లాలోని 2,43,337 పింఛన్‌దారులకు రూ.103.54 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సచివాలయాల సిబ్బంది ఒక్క రోజులోనే పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీం బాషా పాల్గొన్నారు.

10 గేట్లు ఎత్తి...

శ్రీశైలం, జూలై 30: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. జూరాల, సుంకేశుల నుంచి వరద ప్రవాహం పెరగడంతో డ్యామ్ క్రస్టుగేట్లను మంగళవారం ఉదయం 11:30 గంటల సమయంలో 3 నుంచి 5 గేట్లు, సాయంత్రం 6 గంటల సమయానికి మరో రెండు గేట్లు, రాత్రి 9:30 గంటలకు మూడు గేట్లు మొత్తం 10 క్రస్టుగేట్లను పది అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు.


రాత్రి 9:30 గంటలకు పదిగేట్ల నుంచి నీటి విడుదల


సాయంత్రం 6 గంటల సమయంలో ఏడుగేట్ల నుంచి పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

ఆలూరు బ్రాంచ్ కెనాల్‌ను తవ్వేసిన వైసీపీ నాయకులు

రాత్రివేళ నాన్ ఆయకట్టుకు నీటిని మళ్లించుకునే యత్నం


పైపులైన్ ఏర్పాటు చేసుకునేందుకు వైసీపీ నాయకులు తవ్విన గుంత

చిప్పగిరి, జూలై 30: చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామంలో వైసీపీకి చెందిన మాజీ సర్పంచు కుమారులు ఆలూరు బ్రాంచ్ కెనాల్‌ను రాత్రికి రాత్రే తవ్వి మట్టిని తరలించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆలూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని 19,20 కిలోమీటర్ల మధ్య ప్రధాన కాలువతో దాదాపు 300 మీటర్ల మేర 6 అడుగుల లోతున మట్టిని తొలగించారు. అక్కడ నిల్వ ఉన్న నీటిని మోటార్ల ద్వారా తమ పొలాల్లో ఏర్పాటు చేసుకున్నారు. పెద్ద మట్టి గుంతల్లో నిల్వ ఉంచుకునేలా ప్లాన్ చేసి 20 ఎకరాల పొలంలో నాన్ ఆయకట్టుకు నీటిని మళ్లించుకోవాలన్నారు. 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో పొలానికి పైపు లైన్ ద్వారా నీటిని మళ్లించుకునే ప్రయత్నాలు చేశారు. ఇదే జరిగితే 9వ డిస్ట్రిబ్యూటరీ నుంచి 19వ డిస్ట్రిబ్యూటరీ వద్ద ఉన్న రామదుర్గం, నగరడోణ గ్రామాల పరిధిలోని ఆయకట్టు రైతులకు సమస్యగా మారుతుంది. ఇంత జరుగుతున్నా హెచ్చెల్సీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తిమ్మయ్య, హుసేనీ, రామాంజనేయులు ఆరోపిస్తున్నారు.


వైసీపీ నాయకులు తవ్విన ఆలూరు బ్రాంచ్ కెనాల్

ఉచిత న్యాయ సహాయం

శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్



అవగాహన కల్పిస్తున్నలోక్ అదాలత్ అధ్యక్షుడు

కర్నూలు(లీగల్), జూలై 30: శాశ్వత లోక్‌అదాలత్‌లో కక్షిదారులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం. వెంకట హరినాథ్ తెలియజేశారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో శాశ్వత లోక్‌అదాలత్‌లపై వివిధ శాఖల అధికారులతో అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లో లేని వివాదాల్లో సత్వరంగా, ఉచితంగా న్యాయ సహాయం అందించేందుకు ఈ శాశ్వత లోక్‌అదాలత్ వ్యవస్థ ఏర్పడిందని అన్నారు. లోక్ అదాలత్ తీర్పుకు అప్పీలు కూడా ఉండదని తెలిపారు. ఈ శాశ్వత లోక్‌అదాలత్‌లో రవాణా, పోస్టల్, విద్యుత్, మున్సిపాలిటీ, ప్రజారోగ్యం, బీమా, బ్యాంకింగ్, విద్య, రియల్ ఎస్టేట్ రంగాల్లోని వివాదాలపై దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని శాశ్వత లోక్‌అదాలత్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి : ఎస్పీ

ఉరుకుంద ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలపై సమీక్ష

కౌతాళం, జూలై 30: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 2 వరకు జరిగే శ్రావణమాసపు ఉత్సవాలలో స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ఎస్పీ బిందుమాధవ్ దేవాలయ అధికారులకు తెలిపారు. మంగళవారం ఎస్పీ శ్రావణ మాసపు ఉత్సవాలకు ఏర్పాట్లను ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి, ఆలయ ఈఓ వెంకటేష్‌తో కలిసి పరిశీలించారు. ముందుగా ఆలయ అధికారులు వారికి ఘనస్వాగతం పలికి స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేపట్టి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసి పూలమాల శాలువాలతో సన్మానించారు. అనంతరం వారు ఆలయ పరిసరాలలో చేపడుతున్న ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించేలా ఏర్పాట్లను చేపట్టాలని తగు సూచనలు చేపట్టారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, మహిళ భక్తులకు స్నానాల ఘాట్ల వద్ద ప్రత్యేక షెడ్లను ఏర్పాట్లు చేయాలని సూచించారు. వీరి వెంట కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, సూపరిటెండెంట్‌లు వెంకటేశ్వర్లు, మల్లికార్జున, ఆలయ అర్చకులు ఈరప్ప స్వామి, మాహదేవ స్వామి ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

గోనెగండ్ల, జూలై 30: గోనెగండ్ల మండలంలోని ఎర్రబాడు గ్రామంలో బోయ లిక్కన్న(32) అనే యువకుడు కడుపునొప్పి తాళలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రామకృష్ణయ్య తెలిపిన మేరకు వివరాలు... మండలంలోని ఎర్రబాడు గ్రామానికి చెందిన బోయ లిక్కన్న గత కొన్ని మాసాలుగా కడుపు నొప్పితో బాధపడేవాడు. కుటుంబసభ్యులు పలు చోట్ల ప్రభుత్వ ప్రైవేట్ వైద్యుల దగ్గర వైద్యం చేయించారు. అయినప్పటికీ వ్యాధి నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం తెల్లవారుజామున గ్రామ పొలిమేర దగ్గర ఉన్న తన అన్న పొలంలోని వేప చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జల గలగలలు

సంగమేశ్వరంలో ఎగువ పుష్కరఘాట్‌ను ముంచెత్తుతున్న నదీజలాలు

ఆత్మకూరు, జూలై 30: సప్తనదీ సంగమ క్షేత్రం నదీజలాల శోభతో తొణికిసలాడుతోంది. కృష్ణ, వేణి, తుంగ, భద్ర, మలాపహరణి, భీమరథి, భవనాసి అనే ఏడు నదుల సంగమ ప్రదేశంలో వెలసిన సంగమేశ్వర క్షేత్రం ఇప్పటికే జలాధివాసమైంది. అయితే ఎగువ రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల నుంచి శ్రీశైల జలాశయానికి భారీగా నీటి విడుదల జరుగుతున్న నేపథ్యంలోని సంగమేశ్వరంలో ఎగువ పుష్కర ఘాట్‌ను నదీజలాలు ముంచెత్తుతున్నాయి. సంగమేశ్వరాలయంలోని ఎగువ పుష్కరఘాట్ చివరి మెట్టు మాత్రమే కనిపిస్తోంది. ఎగువన ఉన్న ఉమామహేశ్వరాలయానికి అతిచేరువకు నదీజలాలు వస్తున్నాయి. కపిలేశ్వరం నుంచి సంగమేశ్వరానికి చేరుకునే రహదారి పక్కనే వున్న నదీతీరం వరకు జలాలు వచ్చిచేరాయి. దీంతో నదీజలాల సవ్వడులతో తొణికిసలాడుతున్న కృష్ణానది పరవళ్లను వీక్షించేందుకు సందర్శకులు సంగమేశ్వరానికి తరలివస్తున్నారు.


సప్తనదీ సంగమ క్షేత్రంలో నదీజలాలు


పీబీఆర్‌లోకి చేరుతున్న కృష్ణా జలాలు


రిజర్వాయరుకు ఇరువైపులా జలాలను తిలకిస్తున్న సందర్శకులు

వీబీఆర్‌కు భారీగా ఇన్‌ఫ్లో

వెలుగోడు, జూలై 30: తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయానికి రోజురోజుకూ ఇన్‌ఫ్లో భారీగా పెరుగుతోంది.. మంగళవారం సుమారు 12000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఎగువన కురిసిన భారీ వర్షాలకు ఆల్మట్టి, తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు పూర్తి స్థాయిలో నిండుకోవడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు పోతిరెడ్డిపాడు నుంచి నీటిని దిగవకు విడుదల చేశారు. ఈ నీరు బానకచెర్ల సముదాయం నుంచి వెలుగోడు జలాశయానికి చేరుకుంటుంది. జలాశయ పూర్తి సామర్థ్యం 16.95 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం జలాశయంలో 3.162 టీఎంసీలకు చేరుకుంది. జలాశయంలో రోజురోజుకూ నీటి మట్టం పెరుగుతోంది. ఈ జలాశయం శ్రీశైలం మహానంది వెళ్లే ప్రధాన రహదారిలో ఉండటంతో సందర్శకుల తాకిడి అధికమైంది.

రస్తా కోసం ఘర్షణ

● ఒకరికి తీవ్ర గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 30: ఎమ్మిగనూరు మండలంలోని పరమాన్‌దొడ్డి గ్రామంలో రస్తా విషయంలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో గొల్ల వెంకటేష్ తలకు తీవ్రరక్త గాయం కాగా, లక్ష్మీనారాయణ, మహానంది లకు స్వల్పగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చాకలి పెద్దరోగెప్ప, చాకలి చిన్న రోగెప్పలకు, గొల్ల వెంకటేష్, లక్ష్మీనారాయణ, మహానంది మధ్య పొలం రస్తా విషయంలో గత కొన్ని రోజులుగా వివాదం జరుగుతుంది. ఈ విషయం గతంలో పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. అయితే మంగళవారం పొలం దగ్గర పాతకాలం నుంచి ఉన్న రస్తాను చాకలిపెద్ద రోగెప్ప, చాకలి చిన్న రోగెప్ప లతో పాటు మరికొంతమంది చదును చేసే తమ పొలంలోకి కలుపుకునేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న గొల్ల వెంకటేష్, లక్ష్మీనారాయణలతో పాటు మరికొంతమంది ఎప్పటి నుంచో ఉన్న రస్తాను తొలగిస్తే మేము పొలాలకు ఎలావెళ్లాలంటూ ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వాగ్వాదం కాస్తా పెద్దదై ఘర్షణకు దారితీసింది. దీంతో చాకలి పెద్ద రోగెప్ప, చాకలి చిన్న రోగెప్ప, గుడిసె నరసన్న, రామాంజ నేయులు, వెంకటేష్, చంద్ర, తాయప్ప గొల్ల వెంకటేష్, లక్ష్మీనారాయణ, మహానందిలపై కర్రలతో దాడి చేశారు. ఈదాడిలో గొల్ల వెంకటేష్ తలకు తీవ్ర రక్తగాయమైంది. వారిని మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితులు గొల్ల వెంకటేష్ బంధువులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చాకలి చిన్న రోగెన్న, రామాంజ నేయులు, వెంకటేష్, చంద్ర, తాయప్పలపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇన్నోవాలో వచ్చి మేకల చోరీ

ఎమ్మిగనూరు రూరల్, జూలై 30: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బోడబండ గ్రామంలో దొంగలో ఇన్నోవా కారులో వచ్చి మేకలను దొంగలించిన సంఘటన మంగళవారం తెల్లవారు జామున 2గంటలకు జరిగింది. బాధితుడు బైంటింటి గోపాల్ తెలిపిన వివరాల మేరకు... ఆయన తనకున్న రెండు మేకలను ఇంటి బయట ఆవరణలో కట్టివేశారు. రోడ్డుపక్కనే తన ఇల్లు ఉండడంతో రాత్రి 2గంటల సమయంలో ఇన్నోవా కారులో వచ్చిన కొంతమంది దుండగులు రెండు మేకలను దొంగలించుకెళ్లాడని ఆయన తెలిపారు.

బటన్ నొక్కి మెక్కేసిన సొమ్మును కక్కిస్తాం

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ క్రిష్ణమూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న కేఈ క్రిష్ణమూర్తి

కర్నూలు(అర్బన్), జూలై 30: గత ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్ సీఎం హోదాలో బటన్ నొక్కి కాజేసిన ప్రజల సొమ్మును కక్కిస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ క్రిష్ణమూర్తి అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకేపోగు ప్రభాకర్, వై నాగేశ్వరరావు యదవ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోచేసిన ప్రజాధనాన్ని తిరిగి రప్పిస్తామని, పేదలకు, బీదలకు సద్వినియోగ పరిచేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ దిశగా ముందుకు వెళుతున్నారని తెలిపారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వేలాది ఎకరాల ప్రజల భూములను బినామీల పేర్లతో అక్రమించుకున్నారని అన్నారు. తన అక్రమాలు బయట పడతాయనే ఉద్దేశంతో సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఫైళ్లను తగుల బెట్టించడమే కాకుండా లెక్కకు మించిన ఫైల్స్ తన పీఏ ద్వారా హైదరాబాద్‌కు తరలించారని, ట్రంకు పెట్టెల్లో వాటిని దాచారని, ఇది పోలీసుల సోదాలో బయట పడిందని తెలిపారు. ఈ సమావేశంలో సంత్రం రామక్రిష్ణుడు, సోమిశెట్టి నవీన్, జేమ్స్, ఎస్కే బషిర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

డోన్(రూరల్), జూలై 30: డోన్‌లో గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన రామదాస్ అనే వ్యక్తి అతని అనుచరుడు మోక్షిత్‌తో కలిసి డోన్ పట్టణం సమీపంలోని కొత్తపల్లి బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తుండగా.. వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ తెలిపారు. డోన్ పట్టణం పాతపేటకు చెందిన పవన్ 1200 గ్రాముల గంజాయిని తరలిస్తుండగా.. దాడులు చేసి స్వాధీన చేసుకున్నట్లు తెలిపారు. దాని విలువ రూ.25వేలకు పైగా ఉంటుందన్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ గంజాయిని పాతపేటకు చెందిన అర్జున్, పవన్ పలు ప్యాకెట్ల ద్వారా అమ్ముతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి కిడ్నాప్ కలకలం

డోన్(రూరల్), జూలై 30: డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన మధు కుమార్ అనే యువకుడు బ్యాంకాక్‌లోని థాయ్‌లాండ్‌లో కిడ్నాప్‌కు గురయ్యాడని సమాచారం. గత కొద్ది రోజుల కింద ఇతను కిడ్నాప్‌కు గురైన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. మధు కుమార్ సోదరి రాజ్యలక్ష్మి ఈ నెల 28వ తేదీన డోన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. డోన్ రూరల్ ఎస్ఐ, సిబ్బంది బెంగళూరు వెళ్లి మధు కుమార్ ఆరోగ్య వివరాలు సేకరించారు. అధిక జీతాలు వస్తాయన్న ఉద్దేశంతో మధుకుమార్ బ్యాంకాక్ వెళ్లినట్లు తెలుస్తోంది. ఘటనపై రూరల్ సీఐ అజ్రత్‌బాషా మాట్లాడుతూ బ్యాంకాక్‌లో ఈ సంఘటనపై చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

రోగి ప్రాణం కాపాడిన వైద్యులు

వెలుగోడు, జూలై 30: ఓ వ్యక్తికి అనుకోకుండా ఛాతి నొప్పి వచ్చింది. వెలుగోడు వైద్యశాలకు చేరుకున్న ఆ వ్యక్తిని పరీక్షించిన వైద్యులు గుండెపోటు వచ్చిందని నిర్ధారించి రూ.40 వేల విలువ చేసే సూది మందు వేసి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వెలుగోడు మండలంలోని గుంతకందాల గ్రామానికి చెందిన మార్క్ అనే యువకునికి ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే వెలుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యాధికారి ఇక్రమ్ అలిఖాన్ పరీక్షించి గుండెపోటు వచ్చిందని నిర్ధారించారు. వెంటనే రూ.40 వేల విలువ చేసే ఎలాగ్జిమ్ 40 అనే సూది మందు వేసి ప్రాణాపాయం నుంచి తప్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

సీఎం చంద్రబాబు పర్యటనపై కలెక్టర్ సమీక్ష


సమీక్షిస్తున్న కలెక్టర్

శ్రీశైలం, జూలై 30: ఆగస్టు ఒకటో తేదీన సీఎం నారా చంద్రబాబు నాయుడు శ్రీశైలం పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం దేవస్థానం సీసీ కంట్రోల్ గదిలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్, జేసీ సి. విష్ణుచరణ్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజుతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీశైలం క్షేత్ర పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను విజయవంతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒకటో తేదీన ఉదయం 9:50 గంటలకు సుండిపెంట హెలిప్యాడ్‌కు చంద్రబాబు చేరుకుంటారన్నారు. అనంతరం శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని, శ్రీశైలం ప్రాజెక్టుకు జలహారతి ఇస్తారన్నారు. అనంతరం జలాశయం కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రం సందర్శన, సుండిపెంటలోని వాటర్ యూజర్స్ అసోసియేషన్‌తో ముఖాముఖి నిర్వహిస్తారని తెలిపారు.

బంగారు నగల వ్యాపారి సురక్షితం

● కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు
● పోలీసుల అదుపులో నిందితుడు, స్కార్పియో వాహనం
● మరో ఇద్దరి కోసం గాలింపు


కిడ్నాపర్ల చేతిలో గాయపడిన డమాం వెంకటేశ్వర్లు

గూడూరు, జూలై 30: గూడూరు పట్టణంలో బంగారు నగల వ్యాపారి కిడ్నాప్‌ను పోలీసులు చాలెంజ్‌గా తీసుకొని పన్నెండు గంటల లోపే ఛేదించి నగర వ్యాపారిని సురక్షితంగా కాడపాడారు. సోమవారం గూడూరు పట్టణంలో డమాం వెంకటేశ్వర్లును ఎమ్మిగనూరు రోడ్డులో దాల్ మిల్ దగ్గర గుర్తు తెలియని దుండగులు కిడ్నాప్ చేసిన సంఘటన తెలిసిందే. కిడ్నాప్ సంఘటన తెలిసిన వెంటనే కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, గూడూరు, కోడుమూరు, కె.నాగలాపురం ఎస్ఐలు హనుమంతయ్య, బాలనరసింహులు, శ్రీనివాసులు పోలీసు సిబ్బందితో బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. నగర వ్యాపారి డమాం వెంకటేశ్వర్లును అపహరించిన దుండగులు అతని సోదరునికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేయడంతో స్కార్పియో వాహనం ఎక్కడెక్కడ తిరుగుతుందన్నది సీసీ పుటేజీ ద్వారా పోలీసులు పరిశీలించారు. అలాగే ఫోన్ సిగ్నల్ ఎక్కడి నుండి వచ్చింది, ఎక్కడ ఫోన్ సిగ్నల్ నిలిచింది అన్నది పోలీసులు పరిశీలించారు. దుండగులు వాహనంలో పొలాల్లో విండ్ పవర్ ఫ్యాన్ల కోసం వేసిన రోడ్లపై తిరుగుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు ఫోన్ సిగ్నల్ ఆధారంగా పొలాల్లో వేసిన దారులతోపాటు మెయిన్ దారులను కట్టడి చేశారు. చివరకు మంగళవారం తెల్లవారు జామున ప్యాలకుర్తి సమీపంలో కాలువ వెంట స్కార్పియో వాహనం వస్తున్నది గమనించిన కె.నాగలాపురం ఎస్ఐ శ్రీనివాసులు తమ వాహనాన్ని అడ్డు పెట్టబోగా దుండగులు పోలీసు వాహనాన్ని ఢీకొట్టే ప్రయత్నం చేశారు. పోలీసులు చాకచక్యంగా దుండగుల వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో ఉన్న దుండగులు తప్పించుకునే ప్రయత్నం చేయగా అందులో ఒక వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు పారిపోయారు. వాహనంలో ఉన్న బాధితుడు డమాం వెంకటేశ్వర్లును రక్షించారు. అయితే కిడ్నాప్ సమయంలోనే డమాం వెంకటేశ్వర్లును దుండగులు గాయపరిచినట్లు గుర్తించారు. పట్టుబడిన నిందితుడు నుంచి రాబట్టిన సమాచారం మేరకు తప్పిచుకున్న వారి కోసం పోలీసులు గాలింపు చర్యలను తీవ్రతరం చేశారు.

టిడ్కో కాలనీ ఆవరణలో మహిళా మార్ట్

● రూ.1.66 కోట్లతో నిర్మాణం ● నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి ఫరూక్


శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

నంద్యాల టౌన్, జూలై 30 : నంద్యాల మున్సిపా లిటీ పరిధిలో ఎస్ఆర్‌బీసీ కాలనీ టిడ్కో గృహాల ఆవరణ లో రూ.1.66 కోట్లతో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసేందు కు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఏపీ నివాస సముదాయం, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టిడ్కో), నంద్యాల పురపాలక సంఘం పీఎంఏవై (అర్బన్) సంయుక్త ఆధ్వర్యంలో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేయనున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో నంద్యాలలో పది వేల టిడ్కో గృహాలను నిర్మించేందుకు సంకల్పించి అందులో దాదాపు 85 శాతం పనులను పూర్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టిడ్కో గృహాల పూర్తిని గాలికి వదిలేసి, ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో 250 గృహాలను మాత్రమే లబ్ధిదారులకు ఇచ్చి చేతులు దులుపుకుంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అర్హులందరికీ ఇళ్లు ఇవ్వడానికి టిడ్కో గృహాలను వీలైనంత త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎస్ఆర్‌బీసీ కాలనీ ఆవరణలోని టిడ్కో గృహ సముదాయంలో దాదాపు నాలుగు వేల గృహాలు ఉన్నాయి. వచ్చే కొద్ది నెలల కాలంలో మొత్తం గృహాల్లో లబ్ధిదారులను చేర్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో ఇక్కడ నివాసం ఉండే వారికి నిత్యావసర సరుకుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు రూ.1.66 కోట్లతో మహిళా మార్ట్‌ను నిర్మించనున్నారు. ఈ నెల 31వ తేదీన రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శంకు స్థాపన చేయనున్నట్లు కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శంకుస్థాపన ఏర్పాట్లను మంగళవారం కమిషనర్‌తోపాటు పురపాలక ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పరిశీలించారు.

టీడీపీతోనే పేదల సొంతింటి కల సాకారం

నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జూలై 30: పేదవారి సొంతింటి కల టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని హుస్సేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చేసరికి ప్రభుత్వ ఖజానాలో పైసా కూడా లేదని ఏ శాఖలో చూసినా అప్పులే కనపడుతున్నాయని అన్నారు. అందరికీ ఇళ్లు అనే నినాదంతో చంద్రన్న ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు అందజేస్తుందని అన్నారు. ఇందులో ప్రభుత్వం వాటా రూ.1.50, కేంద్రం వాటా రూ.2.50 లక్షలు ఇవ్వనుందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకుడు మహబూబ్‌బాషా, కాపు సంఘం నాయకుడు కెవి. మధు, బజారు, వేణు పాల్గొన్నారు.

పంచాయితీ కార్యదర్శుల సస్పెన్షన్‌కు సిఫారసు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 30: పంచాయితీరాజ్‌శాఖ నిర్దేశించిన పనులు నిర్వహించడంలో పూర్తి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిన ఆస్పరి మండలంలోని పంచాయితీ కార్యదర్శులు వెంకటేష్, నబీ సాహేబ్, రామ్మూర్తి, సురేష్‌లపై సస్పెన్షన్‌కు డీపీవో నాగరాజు నాయుడు జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేశారు. ఓడీఎఫ్ సర్వే, పీఆర్‌వన్ యాప్ లక్ష్యాలను సాధించడంలో ఆస్పరి మండలంలోని పంచాయితీ కార్యదర్శులు పూర్తి ఉదాసీనతతో ఉన్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీపీవో కార్యాలయంలో సమీక్ష సమావేశానికి హాజరు కావాలని ఆదేశించినా కొందరు పంచాయితీ కార్యదర్శులు గైర్హాజరు కావడాన్ని ఆయన తప్పు పట్టారు. అధికారుల ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేశారు.

ఆర్‌యూలో పలువురికి బాధ్యతలు

కర్నూలు(అర్బన్), జూలై 30: రాయలసీమ యూనివర్సిటీలో ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ పలువురు ఆచార్యులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్‌గా తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య ఎన్.నరసింహులు, ఎకనామిక్ విభాగ సమన్వయకర్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.శ్రీధర్‌లకు బాధ్యతలు అప్పగించారు.

చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు

● ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, జూలై 30 : చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించేవారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెల్లడించారు. మంగళవారం జిల్లాలో నేర నివారణే లక్ష్యంగా చేపట్టిన వివిధ చర్యల గురించి ఎస్పీ వివరించారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో మట్కా, జూదం, అక్రమ మద్యం, ఇసుక, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణకు మోటార్ వెహికల్ యాక్టును కట్టుదిట్టంగా అమలు చేస్తామని అన్నారు. లాడ్జిలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడానికి కార్యాచరణకు దిగుతామని అన్నారు. ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 9 కేసులు నమోదు చేశామని, ఎన్‌ఫోర్స్ మెంట్‌లో భాగంగా 68 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామని తెలిపారు. మోటార్ వెహికల్ చట్టం అమలు చేసి 212 కేసులు నమోదు చేసి రూ.63,120 జరిమానా విధించినట్లు తెలిపారు. అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో సెబ్ అధికారు లు, సివిల్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో అక్రమ మద్యంపై 11 డీపీఎల్ కేసులలో నాటు సారా కేసులు నమోదు చేసి 80 లీటర్లు స్వాధీనం చేసుకోవడంతోపాటు 94 (90 ఎంఎల్) మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

37వ వార్డులో మురుగు సమస్య

- ఏడాది నుంచి ఇళ్ల ముందు నిలిచిన మురుగు
- స్కందా యాజమాన్యం పట్టించుకోలేదని ప్రజల ఆగ్రహం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు

కల్లూరు, జూలై 30: నగరపాలక సంస్థ 37వ వార్డు పరిధిలోని స్కందాన్సీ లోటస్ విల్లాస్‌లో ఏడాదికి పైగా ఇళ్ల ముందు మురుగు నిలిచి ప్రజలు రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. 37వ వార్డు ఉల్చాల రోడ్‌లో ఏర్పాటైన స్కందాన్సీ లోటస్ విల్లాస్‌లో 50 గృహాల సముదాయం ఉండగా నివాసాల మధ్య డ్రైనేజీ వాటర్ నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. కాలనీవాసులు సమస్యను స్కందాన్సీ యాజమాన్యం దృష్టికి తీసుకుపోగా మోటార్ పెట్టి మురుగునీరు కొంతకాలం బయటికి పంపారని కాలనీవాసులు తెలిపారు. స్కందాన్సీ లోటస్ విల్లాస్ నుంచి మురుగు కాల్వలు నిర్మించి వదిలేశారు. దీని వల్ల ఇండ్లలోంచి వచ్చే మురుగు నీటి సమస్య జటిలంగా మారింది. కాలనీ ప్రజలు సమస్యలపై కలెక్టరేట్ స్పందనలో వినతిపత్రం ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయం అధికారుల దృష్టికి తీసికెళ్లారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేకు వినతిపత్రాలు ఇచ్చారు. అయితే ఎవ్వరూ పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్కందాన్సీ యాజమాన్యం, మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇంటి ముందు పేరుకుపోయి పాచిపట్టిన డ్రైనేజీ నీరు



ఇళ్ల ముందు నిలిచిన మురుగును చూపిస్తున్న కాలనీవాసులు

మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు

ఏడాదికి పైగా ఇళ్ల ముందు మురుగుతో ఇబ్బంది పడుతున్నాం. మున్సిపల్ అధికారులకు, కలెక్టర్‌కు, అప్పటి ఎమ్మెల్యేకు చాలాసార్లు సమస్యను తెలిపాం. అధికారులు స్పందించి మురుగు కాల్వలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలి

\- కస్తూరి, కాలనీ మహిళ

ఇళ్లలోకి విష పురుగులు వస్తున్నాయి

ఇంటి ముందు డ్రైనేజీ వాటర్ నిలువడంతో పాచిపట్టి నడవడానికి కష్టంగా ఉంది. రాత్రివేళల్లో దోమలు, పాములు, విషపురుగులు తాకిడి ఎక్కువగా ఉంది. లక్షలు వెచ్చించి ఇళ్లు కొనుక్కున్నా నిత్యం నరకం చూస్తున్నాము.

\- రమాదేవి, కాలనీ మహిళ

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మంత్రి టీజీ సమక్షంలో టీడీపీలో చేరిన కార్పొరేటర్



మంత్రి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న కార్పొరేటర్, వైసీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), జూలై 30: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం మంత్రి కార్యాలయంలో నగరానికి చెందిన ఐదో వార్డు కార్పొరేటర్ జీఎల్‌పీ సుజాత, వైసీపీ నాయకులు శేషయాదవ్ తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ముందుకు వెళుతున్నామన్నారు. నాయకులు మాట్లాడు తూ మంత్రి టీజీ భరత్ నాయకత్వంలో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని, పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించాలని మంత్రిని కోరారు.

వలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 30: గ్రామ, వార్డు స్థాయిలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏపీ పంచాయతీరాజ్, సర్పంచుల సంఘం అధ్వర్యంలో ఇటీవల విజయవాడలో నిర్వహిం చిన కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేశామని ఆయన పే ర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలని ఏకగ్రీవంగా తీర్మా నించినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండ అమరావతి అభివృద్ధికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్, కౌన్సిలర్, కార్పొరేటర్, చైర్మన్, మేయర్లు ఒక నెల గౌరవ వేతనాన్ని ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించామన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు రావాల్సిన గౌరవ వేతనం ప్రతి నెల వారి ఖాతాల్లో జమచేయాలని కోరామ న్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల కుటుంబాలకు సంవ త్సరంలో ఒకరోజు తిరుమల తిరుపతి దర్శనానికి అవకాశం కల్పించే విధంగా టీటీడీని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించాలని తీర్మానం చేశామన్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

కర్నూలు(న్యూసిటీ), జూలై 30: ఆగస్టు 1న జరిగే స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను నగర పాలక సంస్థ కార్యదర్శి నాగరాజు, మేనేజర్ చిన్నరాముడు పరిశీలించారు. మంగళవారం ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో మేనేజర్ చిన్నరాముడు మాట్లాడుతూ గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతాయన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ ఆఫీసర్ జునైద్, క్లర్క్ జీఎం.శ్రీకాంత్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో ఆవుల తరలింపు

కర్నూలు(న్యూసిటీ), జూలై 30: నగరంలోని ప్రధాన కూడళ్లలో తిరుగుతున్న ఆవులను మున్సిపల్ అధికారులు ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇటీవల ఆవులు రోడ్లపై తిరుగుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఫిర్యాదులు వచ్చాయి. స్పందించిన అధికారులు పాతబస్టాండు, చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంకు వద్ద రోడ్లపై తిరుగుతున్న ఆవులను ట్రాక్టర్లలో దూపాడు వద్ద గోశాలకు తరలించారు. ఈ మేరకు ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ నాయకులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు.



ఆవులను ట్రాక్టర్‌లో తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పత్తిలో పచ్చ పురుగుపై అపోహలు వద్దు

సి.బెళగల్, జూలై 30: పత్తి పంటలో పచ్చపురుగుపై రైతులు అపోహ పడాల్సిన అవసరం లేదని, పచ్చపురుగు నివారణకు మోనో క్రోటోఫాస్, వేపనూనెను కలిపి పిచికారి చేయాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండ లంలోని బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల్లో మిరప, సజ్జ, ఉల్లి కంది, కొర్ర పంటలను ఆయన పరిశీలించారు. ఏవో వెంట ఎంపీ ఈవోలు వెంకటేశ్వర్లు, సిద్దు, రైతులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కోడుమూరు ఎమ్మెల్యే



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు(రూరల్), జూలై 30: కలెక్టర్ రంజిత్ బాషాను మంగళవారం కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన చాంబర్‌లో కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాకప్పి సన్మానించారు. నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ల బదిలీల నేపథ్యంలో నియోజకవర్గానికి మంచి అధికారులను కేటాయించాలని కలెక్టర్‌ని కోరారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైద్య, నర్సింగ్ విద్యార్థులు

గూడూరు జూలై 30: గూడూరు మండలం పెంచికలపాడు దగ్గర ఉన్న విశ్వభారతి వైద్య కళాశాలలో హెల్మెట్ వాడకంపై వైద్య, నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కాంతారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మునీరుద్దీన్ అహ్మద్, డాక్టర్ మహేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శివశంకర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పెద్ద సురేష్, అసోసియేట్ ప్రొఫెసర్ వాజిద్ బాషా పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే కుష్టు వ్యాధి నిర్మూలన

కోడుమూరు(రూరల్), జూలై 30: సమష్టి కృషితోనే కుష్టు వ్యాధి నిర్మూలన సాధ్యమని వైద్యాధికారి డాక్టర్ మదనశేఖర్ అన్నారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం కల్లపరి గ్రామంలో సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబంలోని సభ్యులందరికీ ఆరోగ్య పరీక్షలు చేయాలని సూచిం చారు. చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, చర్మం పొడిగా ఉం డడం, కనురెప్పలు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, చేతి వేళ్లు, కాళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం వంటి లక్షణాలు ఉంటే ఆరోగ్య కార్యకర్తలతో వ్యాధి నిర్ధారించుకోవాలని కోరారు. కార్య క్రమంలో ఎంపీహెచ్‌వో నరసప్ప, సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, సీహెచ్‌వో శాంత, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాల బారిన పడొద్దు

కర్నూలు(అర్బన్), జూలై 30: యువత మాదక ద్రవ్యాల బారిన పడొద్దని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. మంగళవారం వర్సిటీ లైబ్రరీ సమావేశ మందిరం లో జిల్లా న్యాయ సేవాసంస్థ సమన్వయంతో ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం, ర్యాగింగ్, రాహదారి నిబంధనలు, మహిళల అక్రమ రవాణాను అరికట్టడం, హెల్మెట్ వినియోగం తదితర అంశాలపై విద్యార్థులకు అధికారులు అవగాహన కల్పించారు. సీనియర్ సీవిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బీ. లాలావెంకట శేషాద్రి, వివిధ సంఘటనల ఆధారంగా విద్యార్థుల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగరాజు, డీన్ భరత్ కుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాదరెడ్డి, వెంకటరత్నం నాగచంద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమించుకోలేదు

సి.బెళగల్, జూలై 30: మండలంలోని మారందొడ్డి గ్రామానికి చెందిన శ్రీనివాసులుయాదవ్, గోవిందయాదవ్ ప్రభుత్వ భూములు ఆక్రమించుకోలేదని మంగళవారం రెవెన్యూ అధికారులకు విన్నతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబరు 375లో 14 ఎకరాల 5 సెంట్ల భూమి తమకు ఉన్నదని, ఇది తమ పెద్దల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి అని అన్నారు. తమ ఆర్థిక పరిస్థితులు బాగ లేకపోవడంతో గ్రీన్‌కో కంపెనీ వారి పేరుపై రిజిస్ట్రర్ చేసి ఇచ్చామని అన్నారు. అసైన్‌మెంట్ భూములను తాము అక్రమించు కోలేదని తెలిపారు.

గులాబీ రంగు పురుగు నివారణకు చర్యలు

కల్లూరు, జూలై 30: పత్తిసాగులో గులాబి రంగు పురుగు నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ పత్తి శాస్త్రవేత్తలు మంజునాథ్, విష్ణుకుమార్, సూజాత సూచించారు. మంగళవారం కల్లూరు మం డలం ఎ.గోకులపాడు గ్రామంలో వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పత్తి శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు వ్యవసాయ సంచాలకులు, రైతులు లక్ష్మీవరదారెడ్డి, వెంకట్రామిరెడ్డి, గిడ్డయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

నేడు జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 30: స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో బుధవారం ఉదయం 9 గంటలకు జూనియర్ సాఫ్ట్‌బాల్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు ఎస్.జాకీర్ హుశేన్, కార్యదర్శి విజయ్‌లు మంగళవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే 11వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జూలై 30: కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నగరపాలక సంస్థ మేయర్ బీవై.రామయ్య అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో రూ.2కోట్లతో నిర్వహించనున్న అభివృద్ధి పనులకు మేయర్ బీవై రామయ్యతో కలిసి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అందులో భాగం గా 19వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో రూ.కోటితో షిరిడిసాయి నగర్, సోమిశెట్టినగర్-2, నజర్‌కాలనీ, ఆయి షానగర్, రాంనగర్, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ కాలనీల్లో ఇంటర్నల్ రోడ్ల నిర్మాణం, అదేవిధంగా రూ.కోటితో మజుందర్‌నగర్, హౌసింగ్‌బోర్డ్ కాలనీ నుంచి కేసీ కెనాల్ యు.టి జోహరాపురం రోడ్డు వరకు మేజర్ డిస్పోజల్ డ్రెయిన్ నిర్మాణానికి ఎమ్మెల్యే గౌరు చరిత భూమిపూజ చేశారు. అనంతరం కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా వేసిన కొట్టాలను గౌరు చరిత పరిశీలించారు. అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రజలతో మమేకమై పాణ్యం ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ వార్డుల అధ్యక్షుడు పెరుగు పురుషోత్తంరెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎంఈ శేషసాయి, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, డీఈ రవిప్రకాష్ నాయుడు, టీడీపీ నాయకులు నరేంద్రరెడ్డి, వెంకటక్రిష్ణ, విజయ్, సుబ్బు, శ్రీనివా సరెడ్డి, చంద్రశేఖర్‌శర్మ, సత్యం, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల పేర్లు స్ఫూర్తిదాయకం

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 30: ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లను పెట్టడం స్ఫూర్తిదాయకమని జనసేన పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ అర్షద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని గాంధీ విగ్రహం ఎదుట ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా షేక్ అర్షద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలను తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నారని, అటువంటిది కూటమి ప్రభుత్వంలో మహనీయుల సేవలను భవిష్యత్తు తరాలు సైతం స్మరించుకునేలా, వారి పేర్లకు మరింత గౌరవాన్ని అందిస్తూ పథకాలకు రూపకల్పన చేయటం గర్వకారణమన్నారు. పథకాల నామకరణంతో డొక్కా సీత మ్మ, సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం వంటి ఆదర్శమూర్తుల పేర్లకు సముచిత స్థానం కల్పించారన్నారు. కార్యక్రమంలో జనసేన వీరమహిళలు బ్రాహ్మణి, విజయలక్ష్మి, కనకదుర్గ, దేవి, సుమలత పాల్గొన్నారు.



సీఎం, డిప్యూటీ సీఎం ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న జనసైనికులు

బోగస్ సర్టిఫికెట్ల ఏరివేతకు చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్), జూలై 30: వైద్యఆరోగ్య శాఖలో బోగస్ సర్టిఫికెట్ల ఏరివేతకు రాష్ట్ర కేబినెట్ చర్యలు తీసుకోవాలని ఏపీ గవర్నమెంటు ఇన్‌స్టిట్యూట్ టైన్స్ కాంట్రాక్టు మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెం ట్ (మగ) ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షుడు యర్రపురెడ్డి విశ్వనాథ్ రెడ్డి కోరారు. ఈ మేరకు కర్నూలులోని ఆంధ్రప్రదేశ్‌లో లోకాయుక్త సంస్థ సమీపంలో మంగళవారం ఓ హోటల్‌లో మధ్యాహ్నం బాధితులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 2న జరిగే కేబినెట్ సమావేశంలో వైద్యఆరోగ్య శాఖలో ఫేక్ సర్టిఫికెట్ల ఏరివేతకు చర్యలు తీసుకోవాలని కేబినెట్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, వైద్యఆరోగ్యశాఖ మంత్రి రాష్ట్ర ఉన్నతాధికారులను కలవాలని సభ్యులు తీర్మానం చేసినట్లు తెలిపారు. బోగస్ సర్టిఫికెట్లు ఏరివేయాలని ఎంపీహెచ్ఏ(ఎం) ముత్యాల బాలుడు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు 30 మంది బాధితులు జడ్జి ముందు బోగస్ సర్టిఫికెట్లు గురించి వివరించారు. కేసును సెప్టెంబరు 2కు జడ్జి వాయిదా వేశారు.

మట్టి తవ్వకాల పరిశీలన

కర్నూలు(అర్బన్), జూలై 30: నందవరం మండలం హాలహర్వి మైనర్ ఇరిగేషన్ ట్యాంకులో అక్రమ మట్టి తవ్వకాలను పరిశీలించామని గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మంగళ వారం కలెక్టర్ ఆదేశాల మేరకు ట్యాంక్ పరిధిలో అనుమతించిన పరిమాణం కంటే అధిక పరిమాణంలో మట్టి తవ్వకాలు చేపట్టారని, మట్టిని మూగతి వద్ద ఉన్న ఇటుకబట్టీల తయారీ కోసం తరలిస్తు న్నట్లు నిర్ధారించి, వాటినిపై విచారణ చేపడుతున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో సర్వేయర్ మాధవి, సిబ్బంది నీలప్ప, ఉశేన్, అక్బర్ పాల్గొన్నారు.

అనంతపురం వాసికి అరుదైన ఆపరేషన్

కర్నూలు(హాస్పిటల్), జూలై 30: అనంతపురం జిల్లాకు చెందిన 20 ఏళ్ల యువతికి కర్నూలు పెంచికలపాడు విశ్వభారతి మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీ హెచ్‌వోడీ డా.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వహించారు. ఐదు రోజుల క్రితం రోగి కడుపు నొప్పితో బాధపడుతూ విశ్వభారతి మెడికల్ కాలేజీకి వచ్చింది. డా.కృష్ణ నాయక్ రోగికి సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేయగా.. వేరువేరుగా నివేదికలు వచ్చాయి. ఆ తర్వాత ల్యాప్రోస్కోపిక్ చేశారు. రోగి పెద్ద పేగులో గడ్డ అతుకుపోయినట్లు గుర్తించారు. సాధారణంగా ఈ గడ్డ పిండాశయం, మెడ, వెన్నుపూస, ఎముకల కింద వస్తాయని అలాంటిది కడుపు పెద్ద ప్రేగులో రావడం చాలా అరుదని డా.కృష్ణనాయక్ తెలిపారు. మంగళవారం దాదాపు ఒకటిన్నర గంటలు శ్రమించి రోగి పెద్ద ప్రేగులో ఉన్న సీకల్ దర్మాయిడ్‌ను సర్జరీ వైద్యులు డా.కృష్ణ నాయక్, డా.విజయకుమారి తొలగించారు. ఆపరేషన్‌లో మత్తు వైద్యులు లక్ష్మీకుమార్, సర్జరీ వైద్యులు గురురాజ్, చిరాగ్, అభినవ్ పాల్గొన్నారు.

మూడు ఇళ్లను దత్తత తీసుకోండి

కర్నూలు(హాస్పిటల్), జూలై 30: ప్రతి వైద్య విద్యార్థి మూడు ఇళ్లను దత్తత తీసుకుని వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ తెలిపారు. కుటుంబాల దత్తత కార్యక్రమం కింద కర్నూలు మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థుల అవగాహన సదస్సు జరిగింది. అదేవిధంగా నగరంలో బుధవారపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో 2022 బ్యాచ్ రెండో సంవత్సరం చదువుతున్న వైద్యా విద్యార్థులు వైద్య శిబిరాన్ని నిర్వహించి రోగులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డా.సుధాకుమారి, ప్రొఫెసర్ డా.సింధియా శుభప్రద, అసోసియేట్ ప్రొఫెసర్ డా.రేణుక, డా.అరుణ పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో కరుణ క్లబ్ -2024

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 30: బీ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో కరుణా క్లబ్-2024 ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కరుణ ఇంటర్నేషనల్ ట్రెజరర్ నాగరాజు, శశికళ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. పిల్లలకు విలువలతో కూడిన విద్య అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రమాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం

కర్నూలు(కల్చరల్), జూలై 30: నగరంలోని స్వామి విద్యాప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం నిర్వహిస్తున్న సంఘం అధ్యక్షుడు డీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామం సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించండి



మొక్క నాటుతున్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి

ఓర్వకల్లు, జూలై 30: మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. మంగళవారం ఓర్వకల్లులో ఉపాధి కార్యాలయం ఎదురుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మా ట్లాడుతూ ఎంపీడీవో మల్లేశ్వరి ఆధ్వర్యంలో ఉపాధి నిధులతో ఎంపీ డీవో కార్యాలయం ఎదురుగా 500 మొక్కలు నాటామన్నారు. అలాగే మండలంలోని 22 గ్రామ పంచాయితీ, ప్రభుత్వ పాఠశాలలు తదితర ప్రాంతాల్లో 9వేల మొక్కలు ఎంపీడీవో సహకారంతో నాటించామన్నారు. కార్యక్రమంలో ఏపీవో కుమార సాయినాథ్, అబ్దుల్లా, నాగరాజు, శేఖర్ పాల్గొన్నారు.

'అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి'



కరపత్రాలు విడుదల చేస్తున్న రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు

కర్నూలు(కల్చరల్), జూలై 30: అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని పారా లీగల్ వలంటీర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నగరంలోని కేఎస్ఆర్ స్కూల్‌లో జరిగిన ఈ సదస్సులో డాక్టర్ రాయపాటి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వ్యక్తుల అక్రమ రవాణాలో మూడు వంతుల్లో ఒక వంతు చిన్నారుల అక్రమ రవాణా జరుగుతోందని అన్నారు. ఈ విషయంపై తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు అవగాహన కలిగేలా కృషి చేయాలని కోరారు. ఈ సదస్సులో మెల్విన్ జోన్స్ ఉప కార్యదర్శి చిన్నస్వామి, లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవళ్ల వసంత సాయినాథ శర్మకు సత్కారం

కర్నూలు(కల్చరల్), జూలై 30: అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘం (ఏబీబీఎం) రాష్ట్ర విభాగం వారు మంగళవారం కడప జిల్లా కేంద్రం సమీపంలోని గండి ఆంజనేయస్వామి క్షేత్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్వత్ సభల్లో కర్నూలుకు చెందిన పురోహితుడు, జ్యోతిష్య పండితుడు దేవళ్ల వసంత సాయినాథ శర్మను ఘనంగా సత్కరించారు. జ్యోతిష్య కిరీటి అనే బిరుదు ప్రదానం చేశారు. గత రెండు రోజులుగా ఏబీబీఎం ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక రాష్ట్ర సిద్ధాంతులు ఈ సభల్లో పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

సి.బెళగల్, జూలై 30: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి హిమప్రభాకర్ రాజు, ఉపగణాంక అధికారి రమణ, సహాయ గణంక అధికారి ఆదినారా యణ రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా హిమప్రభాకర్ రాజు మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు వర్షపాత నమోదు, మాసంత, వారంతపు రిపోర్టు, పంట నమోదు, వ్యవసాయ కార్యనిర్వహణ రిపోర్టులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారి వెంకటేశ్వర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న గణాంక అధికారులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని, జూలై 30: ఆదోని పట్టణంలోని రాంజల సమీపంలో ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ పనులు నిర్వహణ కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ నాగభూషణం తెలిపారు. రాంజల 33 కేవీ విద్యుతు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుతు లైన్ల నిర్వహణ కొత్త లైన్స్ పనులు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని, జూలై 30: ఆదోని మండలం కడితోట గ్రామానికి చెందిన నాగరాజు అనే యువకుడు కర్ణాటక మద్యాన్ని రైలులో తీసుకొస్తుండగా రైల్వే పోలీసులు పట్టుకున్నారు. ఆర్‌పీఎస్‌ఐ గోపాల్ తెలిపిన మేరకు.. కడితోట గ్రామానికి చెందని బోయ వెంకటేష్ కుమారుడు బోయ నాగరాజు ట్రైన్ నుంచి కర్ణాటక ఒరిజినల్ చాయిస్ మద్యం ప్యాకెట్లను తీసుకొస్తుండగా ఆర్‌పీఎస్‌ఐలు రామస్వామి, గోపాల్ ఏఎస్‌ఐ వీరేష్ తమ సిబ్బందితో స్వాధీనం చేసుకొని ఆ యువకుడుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులకు పురస్కారాలను అందజేస్తున్న ఎస్‌టీయూ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 30: పురపాలక పాఠశాలల్లో చదువుకొని 2023-24 విద్యా సంవత్సరంలో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులకు ఎస్‌టీయూ పట్టణ శాఖ ప్రతిభా పురస్కారాలతో మంగళవారం అభినందించారు. స్థానిక ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎస్‌టీయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశ్రయ సాధనకు అనుగుణంగా చదువుకోవాలని సూచించారు. మున్సిపల్ హైస్కూల్, ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ధనుంజయ, తన్వీర్, హరికృష్ణ, ఈశ్వర్ సీట్లు సాధించారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, బీమరాజు సీనియర్ నాయకులు నిరంజన్, సతీష్, శ్రీనివాసులు, జయరాముడు, గురు రాజా, గంగనాయక్ పాల్గొన్నారు.

గోనెగండ్లలో సర్వే



వ్యాధిగ్రస్తుల ఇళ్లలో దోమల సర్వే చేస్తున్న జిల్లా మలేరియా అధికారులు

గోనెగండ్ల, జూలై 30: గోనెగండలోని మూడు సచివాలయం పరిధిలో జిల్లా మలేరియా అధికారులు డెంగీ అనుమానితుని ఇంట్లో, అలాగే ఆ వీధిలో దోమల సర్వే నిర్వహించారు. జిల్లా మలేరియా సూపర్‌వైజర్ అస్లామ్, భాస్కర్‌రెడ్డి, బాలమద్దయ్య మాట్లాడుతూ సోమవారం ఒకటి అనుమానిత డెంగీ కేసు నమోదు కావడంతో వైద్యసిబ్బంది దోమల సర్వే నిర్వహిస్తున్నమన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న దోమలను, వాటి లార్వాలను గుర్తించామన్నారు. నీరు నిలువ ఉన్న డ్రమ్ములను, గచ్చులను పరిశీలించారు. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సూపర్‌వైజర్ హనుమంతు, సుధాకర్, ఏఎన్ఎం ప్రమీల, మైమూన్, మాధవి పాల్గొన్నారు.

గుండ్లకొండ ఫీల్ట్ అసిస్టెంట్ సస్పెండ్

దేవనకొండ, జూలై 30 : ఉపాధి పనులలో అవకతవకలకు పాల్పడిన గుండ్లకొండ ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్‌ను జిల్లా డ్వామా పీడీ సస్పెండ్ చేశారు. మస్టర్లో బినామీ పేర్లు, రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతోపాటు విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో జిల్లా అధికారులు కృష్ణమూర్తిని సస్పెండ్ చేసినట్లు ఏపీవో కృష్ణమూర్తి తెలిపారు.

తలారికి శిక్ష పడేలా చూస్తాం



జయమ్మను పరామర్శిస్తున్న గుడిసె కృష్ణమ్మ, ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోని రూరల్ జూలై 30: ఆదోని మండలం పెద్ద పెండేకల్లు గ్రామ సర్పంచు ఉప్పర జయమ్మపై ఆఘాయిత్యానికి ఒడి గట్టిన గ్రామ తలారి నరసింహులుకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఫుడ్ కార్పొరేషన్ మాజీ మెంబరు, టీడీపీ మహిళా నాయకురాలు గుడిసె కృష్ణమ్మ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచు జయమ్మను మంగళవారం ఆమె పరామర్శించారు.

● ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్ద పెండేకల్లు గ్రామ సర్పంచు ఉప్పర జయమ్మను ఎమ్మెల్యే పార్థసారథి మంగళవారం పరామర్శించారు. నరసింహులుకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. జయమ్మకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

పత్తి మిరపలో రసంపీల్చే పురుగు

గోనెగండ్ల, జూలై 30: ప్రస్తుతం వాతావరణంలో పత్తి, మిరప పంటలోతో పాటు మరిన్ని ఇతర పంటలపై రసం పీల్చే పురుగు, మడత పురుగు, తామర పురుగు, పేనుబంక, పిండినల్లి తదితర పురుగులు సోకుతున్నాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ సుజాత, డాక్టర్ మంజూనాథ్, డాక్టర్ మోహన్ విష్ణువర్ధన్, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ అన్నారు. మంగళవారం గోనెగండ్ల మండలంలోని వేముగోడు, పుట్టపాశం, గ్రామాలలోని పంట పొలాలో వ్యవసాయశాస్త్రవేత్తలు పర్యటించారు. పత్తి, వేరుశనగ, మిరప, కంది, సజ్జ పంటను పరిశీలించారు. పత్తి పంటకు రసం పీల్చే పురుగు తాకిడి ఎక్కువగా ఉందని పొలాలలో గమనించినట్లు వారు తెలిపారు. బెట్ట పరివస్థితుల వల్ల తామర పురుగు, పేరుబంక, పిండినల్లి, సోకనట్లు కూడా వారు తెలిపారు.

రైతుల పక్షపాతి టీడీపీ

టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి



సాతనూరు గ్రామ సమీపంలో పులికనుమ పంపుహౌస్ స్టేజి 1 దగ్గర పూజలు చేస్తున్నటీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి

కోసిగి, జూలై 30: టీడీపీ ప్రభుత్వ రైతుల పక్షపాతి టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని పులికనుమ ఎత్తిపోతుల పథకం స్టేజి 1. స్టేజి 2 పంపు హౌస్‌లు దిద్ది గ్రామ పంపు హౌస్ పరిశీలించి తుంగభద్రకు పూజలు చేసి రిజర్వాయర్ నీటిని విడుదల చేశారు. రాఘవేంద్రరెడ్డి మట్లాడుతూ తుంగభద్ర నదికి భారీ వరద నీరు రావడం ఎంతో సంతోషించదగ్గర విషయమని, మండలంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సతీష్‌కుమార్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, జ్ఞానేష్, తోవి రామకృష్ణ, వెంకటేష్, లక్ష్మయ్య, తాయన్న, చింతలగిరి నర్సారెడ్డి, బసలదొడ్డి ఈరన్న, గోపాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రాముడు, వీరేష్, నాగేంద్ర, వెంకటేష్, ఈరయ్య, రాజేంద్రనాయుడు,పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పని భారం తగ్గించాలి



మాట్లాడుతున్న వీరేష్

ఎమ్మిగనూరు రూరల్, జూలై 30: ఎమ్మిగనూరు పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పనిభారాన్ని తగ్గించాలని ఏఐటీయూసీ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సంఘం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు పురపాలక సంఘంలో కమిషనర్ గంగిరెడ్డి పారిశుధ్య కార్మికుల పట్ల నిరంకుశ విధానాలను అవలంబిస్తూ కార్మికులపై అదనపు పనిభారం మోపి వెట్టిచాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు రవి, ఖలీల్, వలి,బాషా, రంజాన్, మల్లికార్జునగౌడు, నరసింహులు పాల్గొన్నారు.

సచివాలయం సిబ్బందికి షోకాజ్ నోటీసులు

హొళగుంద, జూలై 30: హొళగుంద మండలంలోని పలు సచివాలయాల్లో విధుల పట్ల నిర్లక్ష్యం, సమయపాలన పాటించని ఎనిమిది మంది సచివాలయం సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో ఆజాద్ మంగళవారం తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సెలవుపై వెళ్లడం, సమయానికి అనుగుణంగా కార్యాలయంలో హాజరుపై సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రజలు సచివాలయానికి పనుల నిమిత్తం వెళ్లితే అందుబాటులో ఉండడం లేదన్నారు.

జీవో 117 రద్దు చేయాలి

వెల్దుర్తి, జూలై, 30: గత ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలలో విలీనం చేయాలని తీసుకొచ్చిన జీవో 117 రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ వెల్దుర్తి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్, ప్రసాద్, గౌరవాధ్యక్షులు శంకరయ్య, సీనియర్ యూటీఎఫ్ నాయకులు నాగేంద్రయ్య, కిష్టన్న, ఫ్లారెన్స్, రంగన్న, మధు, శ్రీదేవి, గౌస్ ఉన్నీషా, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం జీవో నెం 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు కౌలన్న, ప్రశాంత్ భూపాల్, శివ కూమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దకడబూరులోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర,లింగన్న, శంకర్ నాయక్, మల్లికార్జున, హుసేనప్ప, నిసార్ బాషా పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ



అడ్డ పల్లకిలో జగద్గురువును ఊరేగిస్తున్న వీరశైవులు

ఆదోని టౌన్, జూలై 30: జగత్ గురువు, కాశీ క్షేత్ర పిఠాధిపతి 1008 డా. మల్లికార్జున విశ్వరాజ్య మహాస్వాముల వారిని స్థానిక వీరశైవ మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పురవీధులలో అడ్డ పల్లకిలో ఎంతో ఘనంగా ఊరేగించారు.. కలశాలు, బోనాలతో వందలాది మంది మహిళలు ఊరేగింపులో పాల్గొన్నారు. యువతుల కోలాటాలు అందరినీ ఆకర్షించాయి. వీరశైవ ధర్మ ప్రచారంతో పాటు, సరైన వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, దేశం సుభిక్షంగా ఉండాలని జగత్ గురువు రెండు రోజుల పాటు పట్టణంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో పాల్తూరు స్వామి, జంగమ హోసళ్లి స్వామి ఆజాత శంభు లింగ శివచారి, కల్లు మఠం స్వామీజీ గురు శిద్దదేవరు, చౌకీ మఠం స్వామి మఠ్రి రాచోటి స్వామి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు, జూలై 30: కర్ణాటక నుంచి మధ్యాన్ని సరఫరా చేస్తున్న బిల్లెహల్ గ్రామానికి చెందిన జయచంద్ర నుంచి 55 ప్యాకెట్ల కర్ణాటక మద్యం పాకెట్లను స్వాదీనం చేసుకున్నట్లు ఆలూరు సెబ్ ఇన్‌చార్జ్ సీఐ మల్లిక మంగళవారం తెలిపారు.. అలాగే అదే గ్రామానికి చెందిన బోయలక్ష్మి వద్ద నుంచి 22 విస్కీ, టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఆలూరు రూరల్, జూలై 30: గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం సీనియర్ నాయకుడు నారాయణ స్వామి సీఐటీయూ నాయకులు క్రిష్ణ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ విరుపాపురం జలాశయం నుండి వచ్చే తాగునీరు అరికేర, ముద్దనగిరి, కురకుంద. కరడి గూడ్డం, అరికేర తండా గ్రామాలకు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. ఎల్ఎల్‌సీ కాల్వ ద్వారా నిరంతరం జలాశయంలో తాగునీరు నిల్వ చేయాలని కోరారు.

ఇంటికి నిప్పు.. తప్పిన ప్రమాదం

తుగ్గలి, జూలై 30: గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి నిప్పంటించారు. ఇంట్లో ఉన్న వారు స్పందించి మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది.. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారనీ, ఇంట్లో నిద్రిస్తున్న నాగభూషణం రెడ్డి గమనించి మంటలు ఎగిసిపడుతుండటంతో కేకలు వేయడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు తేరుకుని మంటలు ఆర్పడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. దీనిపై చర్యలు తీసుకోవలని తుగ్గలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు, గ్రామస్థులు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణం ఉన్న గ్రామాల్లో ఇటాంటి నిప్పంటించడం చాలా బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా, దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అసెంబ్లీని తలపించిన సర్వసభ్య సమావేశం

● ఎమ్మెల్యే వర్సెస్ జడ్పీటీసీ
● ఎంపీటీసీలకు బదులు బంధువులు హాజరు



సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ మీదకు దూసుకుపోతున్నవైసీపీ నేతలు

హాలహర్వి, జూలై 30: గృహనిర్మాణ పనుల్లో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని జెడ్పీటీసీ లింగప్ప ఆరోపించగా మీ ప్రభుత్వం అమ్మఒడి, రైతు భరోసా ఇవ్వలేదంటూ ఎమ్మెల్యే విరుపాక్షి అనడంతో రసాభాస జరిగింది. ఏకంగా సర్వసభ్య సమావేశం అసెంబ్లీని తలపించింది. మంగళవారం ఎంపీపీ నెట్టికంఠమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆర్అండ్‌బీ, ఆర్టీసీతో పాటు పలుశాఖల అధికారుల గైర్హాజరుపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని స్థానిక అధికారులకు ఆదేశించారు. ఈ తరణంలో శాఖల వారీగా సమీక్ష జరుపుతున్న సమయంలో పథకాల చర్చ జరిపారు. ప్రభుత్వ పథకాలు అమలు జరపడం లేదని జెడ్పీటీసీ లింగప్ప నిలదీయడంతో మీ ముఖ్యమంత్రి పథకాలు ఇవ్వలేకపోతున్నాడంటు వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఒక్క సారిగా వైసీపీ కార్యకర్తలు జెడ్పీటీసీ మీదకు దుసుకొచ్చారు. మేము నిన్ను గెలిపించడానికి ఎంతో కృషి చేస్తే పార్టీ మారవంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నన్ను గెలిపించింది గుంతకల్లు ఎమ్మెల్యే జయరాంగాని, మీరు కాదంటూ వాగ్వాదానికి దిగారు. అధికారులు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. పోలీసులు జోక్యం చేసుకొని సమావేశాన్ని ముగించారు.

తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

ఆలూరు, జూలై 30: తాగునీటి సమస్యపై జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగింది. ఆలూరు పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రతరం కావడంతో పత్తిపాటు ఎమ్మెల్యే రామాంజనేయులు సూచన మేరకు మంగళవారం ఆర్‌బ్ల్యూఎస్, జిల్లా ఎస్ఈ నాగేశ్వర రావ్ ఆలూరులో పర్యటించారు. ఇన్‌చార్జి ఈవో ప్రకాష్ నాయుడుతో చర్చించారు. తాగునీటి సమస్యకు గల కారణాలను తెలుసుకున్నారు. ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత రెండు శాఖలపై ఉందని అన్నారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రణాళికను రూపొందించామని, ఆగస్టు 1 నుంచి వారంలో రెండు సార్లు తాగు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు వివరించారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకూడదని ఎస్ఈ సూచించారు. ఆయన వెంట డీఈ మల్లికార్జునయ్యా పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మ జాతర ఉత్సవాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 30: ఆదోని పట్టణ శివారు ప్రాంతం కొండల్లో వెలసిన ఎల్లమ్మ అవ్వ జాతర ఉత్సవాలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చివరి మంగళవారం కావడంతో అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చివరి మంగళవారం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు, భక్తులు, భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు.

సాయిప్రసాద్‌రెడ్డి సన్యాసం ఎప్పుడు తీసుకుంటారు?

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మి సలీం



కాషాయం దుస్తులను చూపుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మి సలీం

ఆదోని (అగ్రికల్చర్), జూలై 30: మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కాషాయం దుస్తులు ధరించి సన్యాసం ఎప్పుడు తీసుకుంటారో చెప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మి సలీం అన్నారు. మంగళవారం ఆదోనిలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఎన్నికల్లో గెలిస్తే శాశ్వతంగా సన్యాసం తీసుకొని రాజకీయాల నుంచి వైదొలగుతానని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారన్నారు. తమ కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి గెలిచి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసి ఆదోని నియోజకవర్గ ప్రజల సమస్యలపై గళమెత్తారన్నారు. మీరు ఓడిపోయాక ప్రజలకు ముఖం చాటేసి తెలంగాణకు పారిపోయారని అన్నారు. అభివృద్ధిపై ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడుతుంటే కుతంత్రాలు చేయడం మంచిది కాదన్నారు. ముందు మీరు ఎన్నికలకు ముందు విసిరిన చాలెంజ్‌కు కట్టుబడి ఉండి సన్యాసం తీసుకోవాలని సూచించారు.

వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి

హలహర్వి, జూలై 30: హాలహర్విలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వైసీపీ నాయకులు ఇష్టారాజ్యాంగా ప్రవర్తించారని, వారిపై చర్యలు తీసుకోవాని జడ్పీటీసీ సభ్యులు లింగప్ప అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా సమావేశంలోకి దూసుకురావడంతో సమావేశం గందరగోళం ఏర్పడింది. అధికారులు మాత్రం ప్రేక్షకపాత్ర పోషించారని, ఇలాంటి అధికారులు మౌనం చాలా బాధాకరమని అన్నారు.

మట్టి వినాయకులనే ప్రతిష్ఠిద్దాం

ఆదోని టౌన్, జూలై 30: ఈసారి వినాయక ఉత్సవాలల్లో పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠిద్దామని ఉత్సవ కేంద్ర సభ్యులు కోరారు. మంగళవారం వీహెచ్‌పీ కార్యాలయంలో పట్టణ గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. 14 అడుగులలోపు ఉండే విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో సమితి సభ్యులు గోవిందరాజుల గౌడ్, విట్టారమేష్, కునిగిరి నీలకంఠ, నాగరాజ్ గౌడ్, దేవివెట్టి ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల అపహరణ

వెల్దుర్తి, జూలై, 30: వెల్దుర్తి పట్టణ సమీపాన కోదండాపురం దారిలో ఉన్న ఎస్.కె.హబీబా పొలంలో సోమవారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు తోసివేసి అందులో ఉన్న ఆయిల్, పరికాలను గుర్తుతెలియని దుండగులు దొంగలించారు. విద్యుత్ ఏఈ రాఘవేంద్ర బాబు మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. సుమారు రూ.70 వేలు ఆస్తినష్టం సంభవించినట్లు తెలిపారు. విద్యుత్ ఏఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు చేపల వేలం

పత్తికొండ, జూలై 30: పందికోన రిజర్వాయర్‌చేపలవేలాలు బుధవారం నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ అధికారి చంద్రయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వేలాలు ఉంటుందని, రూ.10వేలు ధరావత్తు చెల్లించి పాటదారులు వేలంలోపాల్గొనవచ్చన్నారు. కాగా ఈనెల 20వతేదీ వేలాలనిర్వహణచేపట్టాల్సిఉండగా స్థానికగ్రామాలప్రజల సహకారం నిమిత్తం గడువుకోరడంతో అధికారులు 31వతేదీకి వేలాలను వాయిదా వేశారు.

సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంవీఆర్‌పీఎస్ గౌరవ అధ్యక్షుడు వీజీఆర్ కొండయ్య

ఎమ్మిగనూరు, జూలై 30: ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయిపై చర్యలు తీసుకోవాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వీజీఆర్ కొండయ్య ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం కొండయ్య ఫామ్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి అతిముఖ్యమైనది ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రి అన్నారు. అటువంటి ప్రభుత్వ వైద్యశాలలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మైత్రేయి ఇరువురు మహిళల ప్రసవ సమయంలో నిర్లక్ష్యం వహించి భయభ్రాంతులకు గురిచేసిందన్నారు. దీంతో ఇద్దరు చిన్నారులు మృతి చెందారన్నారు. జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎందుకు స్పందించడంలేదని ఆయన ప్రశ్నించారు. ఆస్పత్రిలో విచారణ జరిపి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని, పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బాధితులు ఖాదర్, రమేష్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమావేశాలకు పిలువకపోతే ఎలా?



మాట్లాడుతున్న ఎంపీపీ అనితాయాదవ్

మద్దికెర, జూలై 30: మండలంలో జరిగే ప్రభుత్వ సమావేశాలకు ప్రజాప్రతినిధులను పిలువకపోతే ఎలా అని జడ్పీటీసీ సభ్యులు మురళిధర్‌రెడ్డి, ఎంపీటీసీలు కాలువ రామకృష్ణా. రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనం నందు మండల సర్వసభ్యసమావేశం ఎంపీపీ అనితాయాదవ్ ఆధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలైన నీతిఆయాగ్, పొదుపు సంఘాల సమైక్య సమావేశాలకు ఎందుకు పిలువడం లేదని ప్రశ్నించారు. మద్దికెర గ్రామంలో చాలా ప్రాంతాలలో వర్షాకాలం వచ్చి నప్పటికి నీటి సమస్య అధికంగా ఉందన్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మండలంలో కొంతమంది కౌలు రైతులు కాకపోయినప్పటికి కౌలు కార్డులు పొందాలని చూస్తున్నారని వారు వాటిని కట్టడి చేయాలని కోరారు. ఏవో మాట్లాడుతూ అర్హలైన వారికి కౌలు కార్డు లు విచారణ చేసి ఇస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అలివేలమ్మ ఏపీవో నర్సిరెడ్డి, ఎంఈవో రంగస్వామి, ఏపీవో మధుబబు, ఏవో రవి, సర్పంచ్ లు సుహాసిని, విజయుడు, మల్లికార్జున, పాల్గొన్నారు.

డెంగీ ప్రబలకుండా చూడాలి

మద్దికెర, జూలై : మండలంలో డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు మాట్లాడుతు మండలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా దోమలు కుట్టకుండా, పుట్టకుండా చూడాలన్నారు. మండలంలో చేపడుతున్న కుష్టు వ్యాధి సర్వే పగడ్బందీగా చేయాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి, నిరంజన్‌బాబు, అక్బర్ బాషా, పాల్గొన్నారు.

బదిలీలు సహజమే



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

తుగ్గలి, జూలై 30: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమే అని సహ ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో ఆటంకాలు లేకుండా విధులు చేశారని తహసీల్దార్ షర్మిళ అన్నారు. మంగళవారం తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల్లో తుగ్గలి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన షర్మిళ బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్లడంతో సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లు, డీలర్లు, పూలమాలలు వేసి శాలువలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ సుదాకర్ రెడ్డి, సర్వేయర్ గాడె లింగప్ప, డీలర్లు చంద్రశేఖర్ యాదవ్, సుంకన్న, రంగన్న తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

వెల్దుర్తి, జూలై, 30: పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బదిలీపై వెళుతున్న తహసీల్దార్ అనంత ఆచారికి రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సత్యసాయి జిల్లా నుంచి వెల్దుర్తికి వచ్చారు. యథావిధిగా ఇప్పుడు సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ రెడ్డి, సర్వేయర్ హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పురుగు ఉధృతిని అరికట్టండి

వెల్దుర్తి, జూలై, 30: పత్తి, ఆముదము, వేరుశనగ పంటలలో పురుగు ఉధృతిని అరికట్టడానికి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా అన్నారు. మంగళవారం వెల్దుర్తి, బింగిదొడ్డి, సూదేపల్లె, గోవర్ధనగిరి గ్రామాలలోని పంటలను పరిశీలించారు. పత్తి పంటలో వచ్చు పచ్చదోమ, గులాబీ రంగు పురుగు, వేరుశనగ పంటలో వచ్చు లద్దెపురుగులను అరికట్టడానికి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ మోహన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పైసా వసూల్‌పై విచారణ

హొళగుంద, జూలై 30: మండల పరిధిలోని గజ్జెహళ్లి గ్రామంలో ఆరు నెలల క్రితం వైసీసీ ప్రభుత్వం హయాంలో జరిగిన రీసర్వేలో రైతుల నుంచి గ్రామ సచివాలయం సర్వేయర్‌లు భూ కొలతలు, ఆన్లైన్లో రికార్డులు నమోదు చేసేందుకు లక్షల రూపాయలు వసూలు చేయడంపై ఈనెల 29వ తేదీన పైసా వసూల్ అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో జిల్లా సర్వేయర్ అధికారి ముని కన్నణ్ స్పందించారు. హొళగుంద మండల సర్వేయర్ శ్రీనివాసులకు విచారణ చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు నిర్ధారిస్తే సర్వేర్లపై కఠిన చర్యలకు కలెక్టర్‌కు సిపార్సు చేస్తున్నట్లు తెలిపారు.

పొలం తగాదాలో దాయాదుల ఘర్షణ

వెల్దుర్తి, జూలై, 30: మండలంలో కసాపురం గ్రామంలో మంగళవారం పొలం తగాదాలో దాయాదుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కురువ తిరుపాలు, వెంకటస్వామి కలసి కురువ ఈశ్వరయ్యను దాడిచేశారు. తలకు బలమైన రక్తగాయాలయ్యాయి. వైచికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేగవంతంగా అన్నా క్యాంటీన్ పనులు

ఆదోని టౌన్, జూలై 30: అన్న క్యాంటీన్లను ప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషర్ రామచంద్రా రెడ్డి తెలిపారు. మంగళవారం అన్న క్యాంటీన్ పనులను ఆయన పరిశీలించారు. మాట్లాడుతూ పట్టణంలో మూడు ప్రాంతాలలో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని, పనులను వేగవంతం చేసి ప్రభుత్వం సూచించిన తేదీలలో ప్రారంభానికి సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు.

వ్యక్తికి గాయాలు

ఆదోని రూరల్, జూలై 30 : ఆదోనికి చెందిన మద్వీరాట్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంలో పెద్దతుంబళం నుంచి ఆదోనికి వస్తుండగా పాండవగల్లు సమీపంలో అదుపు తప్పడంతో ప్రమాదం చోటు చేసుకొంది. ఈ ప్రమాదంలో రక్తపు మడుగులో పడి ఉన్న క్షతగాత్రున్ని స్థానికులు, పోలీసులు ఆదోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరయ్య తెలిపారు.

మహిళ అరెస్టు

ఆదోని చౌదరి బావికి చెందిన బోయ హనుమంతమ్మను ఇస్పీ పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటక బస్సులో మద్యం తరలిస్తుండగా, మదిరె క్రాస్ వద్ద అదుపులో తీసుకొని ఆమె వద్ద నుంచి 288మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు.